# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 01 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 33

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


BHARAT RASHTRA SAMITHI

**అవినీతి కారణంగా బిఆర్ఎస్ అంతర్థానం !**

2లో





## తెలంగాణ వస్తే అభివృద్ధి జరుగుతుందని

# మోసపోయాం

**పాలమూరును ఎండబెట్టిన కెసిఆర్**

**ఎంపిగా గెలిపించినా పట్టించుకోని నేత**

**గ్రీన్ ఛానల్ ద్వారా ప్రజెక్టులకు నిధులు మంజూరు**

**మూసాపేట కార్నింగ్కంపెనీలో రెండో యూనిట్ ప్రారంభం**

**అవకాశాలను అంది పుచ్చుకోవాలని సిఎం రేవంత్ పిలుపు**

తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా అండగా నిలిచింది. కెసిఆర్ మహబూబ్‌నగర్ ఎంపిగా గెలిపించారని సిఎం అన్నారు.కెసిఆర్‌ను ఎంపిగా గెలిపించినా తమ ప్రాంతానికి సముచిత న్యాయం జరగలేదని సిఎం రేవంత్ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రాజెక్టులు సంపూర్ణంగా పూర్తి కాలేదు. పేరుకే పాలమూరు వర్సిటీ- అయినా.. పిజి కాలేజీగానే మిగిలింది. చదువు, ఉపాధి, నీటిపారుదలలో జిల్లాను అభివృద్ధి చేసుకోవాలి. ప్రణాళికలు రచించుకోకపోతే జిల్లాకు శాశ్వతంగా అన్యాయం జరుగుతుంది. జిల్లాకు ట్రిపుల్ ఐటీని మంజూరు చేసుకున్నాం.

మహబూబ్ నగర్: ఒకప్పుడు పాలమూరు వలసల జిల్లాగా ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎక్కడ తట్ట పని, పార పని ఉన్నా పాలమూరు జిల్లా వారే కూలీలని తెలిపారు. అందుకు ప్రధాన కారణం మనం చదువులో వెనకబడి ఉండటమే అని పేర్కొన్నారు. స్వరాష్ట్రం వస్తే.. అభివృద్ధి జరుగుతుందని భావించామని చెప్పుకొచ్చారు. కానీ తెలంగాణ వచ్చాక కూడా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముసాపేట మండలం వేముల కార్నింగ్ కంపెనీలో రెండవ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..అప్పట్లో పాలమూరు విశ్వవిద్యాలయం కేవలం ఒక ఏ కాలేజీలా మాత్రమే ఉండిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం వచ్చిందని తెలిపారు. ఇపుడు విద్యా, ఉపాధి, అవకాశాలను జిల్లా అంది పుచ్చుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పట్లో దివంగత నేత ఇందిరా గాంధీ ఎస్సీ,ఎస్టీలకు భూములు అసైన్ చేసిందని పేర్కొన్నారు. ఇపుడు చదువుకుంటేనే తలరాత మారుతుందని స్పష్టం చేశారు. మీరు చదువుకోవాలంటే కావలసిన వసతుల కల్పన బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా జిల్లా ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.పాలమూరు జిల్లా ఒకనాడు వలసలకు మారుపేరు అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసపేటలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. అనంతరం ఏర్పాటు- చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పాలమూరు బిడ్డల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రాజెక్టు నిర్మాణం జరగలేదని పేర్కొన్నారు. చదువు, నీళ్ల జిల్లా ప్రజలకు అందుబాటు-లో లేక వలసలు పోయారు.

## బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే

# కుట్రలు

**రేపు కెటిఆర్‌కు కూడా ఇలాంటి గతే పడుతుంది**

**నన్ను బయటకు పంపేందుకు ఎప్పటినుంచో ప్లాన్‌లు**

**కెసిఆర్ ఇది గుర్తించి ముందుకు సాగాలి**

**గుంటనక్కలు హరీష్, సంతోష్‌ల పట్ల జాగ్రత్త**

**రేవంత్‌తో కుమ్మక్కయిన హరీష్ రీవు**

**మీడియా సమావేశంలో కవిత సంచలన వ్యాఖ్యలు**

నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత రాజీనామా చేశారు. సంబంధిత రాజీనామా లేఖను బుధవారం శాసన మండలి కార్యాలయంలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఓఎస్డీకి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. గుత్తాతో కవిత ఫోన్‌లో మాట్లాడి, తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. తాను అందుబాటులో లేనని, రేపు మరోసారి ఫోన్‌లో మాట్లాడి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటానని ఛైర్మన్ చెప్పారు. కవిత భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణ భవన్‌లో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డికి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు.



2లో..

## మోదీ దార్శనికతతో జాతీయ

# రహదారుల అభివృద్ధి

హైదరాబాద్: ప్రధాని మోదీ దార్శనికతతో 2014 నుంచి తెలంగాణ జాతీయ రహదారులు అద్భుతమైన ప్రగతిని సాధించాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో బుధవారం ఆయన పోస్టు చేశారు. '2,722 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది. ఎన్‌హెచ్ రోడ్లుగా 2,526 కి.మీ. రాష్ట్ర రహదారుల ఉన్నతీకరణ చేపట్టాం. రూ.38,297 కోట్లతో 1,719 కి.మీ. ఎన్‌హెచ్ కారిడార్లకు అనుమతులు ఇచ్చాం. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద 12 వేల కి.మీ. రోడ్లను నిర్మించాం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.





2లో..

# కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

**ప్రజలకు దమ్మిడీ మేలు చేసేది కాదు**

**కాంగ్రెస్‌పై మరోమారు కెటిఆర్ విమర్శలు**

# జీఎస్టీ బొనాంజా

**ఇక రెండు శ్లాబులే.. 5, 18 శాతాలు మాత్రమే**

**12%, 28% కనుమరుగు**

**తల నూనెలు, టీవీలు, ఆరోగ్య బీమాపై తగ్గనున్న భారం**

**ఖరీదైన కార్లు, పొగాకు ఉత్పత్తులపై 40% వడ్డన**

**ఈ నెల 22 నుంచి అమల్లోకి కొత్త మార్పు**




**జీఎస్టీలో మార్పులు ఇలా..**

| | ప్రస్తుతం | ఇకపై |
|---|---|---|
| **అందుబాటు విద్య** | | |
| మ్యాప్‌లు, చార్టులు, గ్లోబ్‌లు, పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, క్రేయాన్స్, ప్యాస్టెల్స్, ఎక్సర్‌సైజ్ పుస్తకాలు, నోట్‌బుక్స్ | 12% | సున్నా |
| ఎరేజరు | 5% | సున్నా |
| **వ్యవసాయం** | | |
| ట్రాక్టర్ టైర్లు, విడిభాగాలు | 18% | 5% |
| ట్రాక్టర్లు, స్పెసిఫైడ్ బయో పెస్టిసైడ్స్, మైక్రో న్యూట్రియంట్స్, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ, స్ప్రింక్లర్లు, వ్యవసాయ పరికరాలు | 12% | 5% |
| **విద్యుత్ గృహోపకరణాలు** | | |
| ఏసీలు, టీవీలు (32 అంగుళాల పైబడినవి), మానిటర్లు, ప్రొజెక్టర్లు, డిష్ వాషింగ్ మెషీన్లు | 28% | 18% |

దిల్లీ: వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కీలక మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల బదులు ఇకపై రెండే కొనసాగనున్నాయి. వాటిలో ఒకటి 5% కాగా రెండోది 18%. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పదిన్నర గంటలసేపు కొనసాగిన జీఎస్టీ పాలకమండలి 56వ



సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం 12%, 28% పన్ను శ్లాబులు ఇక ఉండవు. గుట్కా, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లపై మినహా మిగిలిన ఉత్పత్తులపై పన్ను మార్పులు ఈ నెల 22 నుంచే అమల్లోకి రానున్నాయి. తలనూనెలు, కార్న్‌ఫ్లేక్స్, టీవీలు, వ్యక్తిగత ఆరోగ్య ఉత్పతులు, జీవిత బీమా పథకాలు వంటివాటిపై పన్ను తగ్గనుంది. రోటీ, పరోటాలపై జీఎస్‌టీ సున్నా. ప్రాణాధార ఔషధాలపై ఎటువంటి పన్ను లేదు. ఖరీదైన కార్లు, పొగాకు ఉత్పత్తులు-సిగరెట్లపై ప్రత్యేకంగా 40% స్లాబును ప్రతిపాదించారు.



2లో..

## హరీష్ రావు, రేవంత్

# కుమ్మక్కు నిజమే

**గతంలోనే తాను ఈ విషయం చెప్పా**

**ఇప్పుడు కవిత కొత్తగా చెప్పిందేమీ లేదు**

**పోచంపల్లి, నవీన్‌రావు అక్రమాలపై విచారణ జరపాలి**

**మీడియాతో ఎంపి రఘునందన్ రావు డిమాండ్**

# భగ్గుమంటున్న బంగారం ధరలు లక్షా పదివేల దిశగా పరుగులు

**న్యూఢిల్లీ** బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. గత 10 రోజులుగా పెరుగుతూ వస్తున్న గోల్డ్ రేట్స్.. ఎప్పుడూ లేని విధంగా కొత్త గరిష్ఠాన్ని తాకాయి. బుధవారం బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,06,970గా.. 22 క్యారెట్ల ధర రూ.98,050గా ట్రేడ్ అవుతోంది. ఈరోజు 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.880.. 22 క్యారెట్ బంగారం రూ.800 పెరిగింది. ఈ 10 రోజుల్లోనే ఏకంగా 5 వేలకు పైగా పెరగడం విశేషం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బంగారం లక్షా పది వేల రూపాయల చేరువకు వచ్చేసింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,06,970గా.. 22 క్యారెట్ల ధర రూ.98,050గా కొనసాగుతోంది. విశాఖ, విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,07,120గా.. 22 క్యారెట్ ధర రూ.98,200గా ట్రేడ్ అవుతోంది. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు కంగారుపడి పోతున్నారు. ఇక దీపావళి నాటికి బంగారం ధరలు ఎలా ఉంటాయో అని -టె-న్షన్ పడుతున్నారు.



## కాళేశ్వరం అవినీతిపై కావాలనే

# కాలయాపన

**కరీంనగర్** కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులు వచ్చాక కూడా కాలయాపన చేశారని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. మరి ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేస్తే ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం ముందుకు వచ్చిందన్నారు. కాళేశ్వరం, గొర్రెలు, బర్రెల కుంభకోణంపై చర్చ జరగాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై సీబీఐ వేయాలని తొలుత డిమాండ్ చేసింది తామేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. అయితే తమ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల కాలయాపన చేశారని మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా సీబీఐ విచారణ ఎలా చేస్తుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కమిషన్ రిపోర్ట్ బీఆర్ఎస్ చేతిలో పెట్టి.. సీబీఐతో విచారణా అని ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ బీఆర్ఎస్‌కు ఇచ్చి.. దొంగ చేతికి సీఎం రేవంత్ రెడ్డి తాళాలు ఇచ్చారంటూ ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బిడ్డ కవిత చెప్పిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తు చేశారు. కేసీఆర్ బిడ్డ రాజీనామా చేస్తే ఏమవుతుందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ సందేహం వ్యక్తం చేశారు.





వేగుచుక్క

# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు



భద్రాద్రి కొత్తగూడెం: హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతులను విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి కావాలని భావించా. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాటు చేసిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం దామరచర్లలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామని గతంలో వైఎస్ఆర్ ప్రకటించారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్లలోకి పేదలు ప్రవేశించినప్పుడు వచ్చే ఆనందం వెలకట్టలేనిది. పేదల కష్టాలు మాకు తెలుసు కాబట్టే .. పేదరికాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రజలకు పదేళ్లపాటు-.. కొత్త రేషన్ కార్డులు అంటే ఏంటో తెలియదు. మా ప్రభుత్వం రాగానే లక్షలాది రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చాం. మేము ఏ బియ్యం తింటున్నామో.. పేదలకూ అవే సన్నబియ్యం ఇస్తున్నాంఅని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ విషనాగు. ఈ పాముతో కాలకూట విషం ఉంది. అయితే, ప్రజలు దాని కోరలు ఎప్పుడో పీకేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారంటూ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. లక్ష కోట్లు- దోచుకున్న వ్యక్తి ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. అక్క, అన్న, చెల్లి, బావ ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. దోపిడీ సొమ్ము వాళ్లింట్లో చిచ్చు పెట్టింది. సంపాదించుకున్న టీవీలు, పేపర్ల కోసం కొట్టుకుంటున్నారు. వాళ్ల వాళ్ల కొట్టు-కుంటూ మాపై నిందలు వేస్తున్నారు. మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది. బీఆర్ఎస్ ను ప్రజలే బొంద పెట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. దామరచర్ల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సొంతిల్లు అనేది ప్రతి పేదవాడి జీవితస్వప్నం అని.. గత పదేళ్ల పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదని అన్నారు. ఏటా 2 లక్షల ఇళ్లు కట్టిస్తే పదేళ్లలో 20 లక్షల మందికి వచ్చేవని.. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనబడుతోంది. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి పాతరేసి భూభారతి తీసుకొచ్చి రైతుల సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మన పిల్లలు బర్రెలు, గొర్రెలు కాసుకోవాలని కేసీఆర్ పార్టీ వాళ్లు అంటున్నారు.. వాళ్ల పిల్లలు మాత్రం చదువుకుని రాజ్యం ఏలి దోచుకుంటారట అంటూ తీవ్రంగా విమర్శించారు. టీవీలు, పేపర్లు సంపాదించుకున్నారు.. వాటి కోసం కొట్టు-కుంటు-న్నారని ఆరోపించారు. దోపిడీ సొమ్మే ఇవాళ వాళ్ల మధ్య చిచ్చు పెట్టిందని, వాటాల కోసం వాళ్లు వాళ్లు కొట్టుకుంటూ మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలే బొంద పెట్టారని.. సచ్చిన పామును చంపాల్సిన అవసరం మాకేముందని ఎద్దేవా చేశారు. మీ కుటుంబ పంచాయితీలోకి మమ్మల్ని లాగొద్దని హెచ్చరించారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల పైలాన్???ను ఆవిష్కరించారు సీఎం రేవంత్. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లా పాల్వంచలోనే మొదలైందని, ఖమ్మం జిల్లా ప్రజల తెలంగాణకు దిశ దిశను చూపించారన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడాలని కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిశారు. ఇది ఎన్నికల స్టంట్ కాదు. ప్రజలు ఆలోచన చేయాలి. రోటి, కప్డా, మకాన్ అనే నినాదాన్ని నాడు ఇందిరమ్మ కొనసాగిస్తే, అదే నినాదాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గల్లీ గల్లీ.. ఊరు ఊరు తిరిగి ప్రతి పేద వాడికి 25 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లోనే ఓట్లు- అడుగుతామని 2023 ఎన్నికల్లో కేసీఆర్‌కు సవాలు విసిరా. పేదలు ఇందిరమ్మ ఇళ్లలోకి గృహ ప్రవేశం చేసినప్పుడు కలిగిన ఆనందం నేను జూబ్లీహిల్స్‌లో గృహప్రవేశం చేసిన రోజు కూడా రాలేదన్నారు. 4500 ఇండ్లు కేవలం అశ్వరావు పేటకు ఇచ్చా. కొందరికి పేదరికం అంటే ఎక్స్ కర్షన్.. మేము పేద వర్గంలో పుట్టి పెరిగి, వారితో అన్ని సమానంగా పంచుకున్నాం. పేదలుగా బతకడం మా జీవన విధానం. పేదరికం తెలిసి, కుటుంబ సభ్యులుగా భావించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఇందిరమ్మను పేద ప్రజల గుండెల్లో అమ్మలా గుడి కట్టుకున్నారు. పేదలు కళ్లు కాయలు కాసేలా వేచి చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమం అందలేదు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి కలిగిన జిల్లా. అందుకే ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులను చేశాం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి. పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉండి ఉంటే పేద వర్గాల కష్టాలు తీరిపోయేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కర్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఓటేస్తే భవిష్యత్‌కు గ్యారెంటీ అన్నారు



అమరావతి: చంద్రబాబూ.. మీకు ఓటేస్తే భవిష్యత్తుకు గ్యారంటీ- అన్నారు. కాని, రైతులకు గతంలో సులభంగా దొరికే బస్తా యూరియా కూడా ఇవ్వలేక పోతున్నారు.. ఇంత అధ్వాన్నంగా ప్రభుత్వాన్ని నడుపుతారా అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత, రైతుల అవస్థలపై ఆయన ట్వీట్ చేస్తూ.. చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడ్డారు. మీరు అధికారంలోకి వచ్చింది మొదలు వరుసగా ఈ రెండేళ్లపాటు- రైతులకు ఎరువుల కష్టాలే. బస్తా యూరియా కోసం రోజుల తరబడి రైతులు క్యూల్లో నిలబడే దారుణ పరిస్థితిని ఎందుకు తీసుకొచ్చారు? మరో వైపు తాజాగా ఉల్లి, చీనీ, మినుము ధరలు కూడా పతనమై రైతులు లబోదిబో మంటున్నారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా మీలో కనీసం చలనం లేదు చంద్రబాబూ? అన్నారు. ఏటా ఏ సీజన్‌లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి, ఎరువులు ఎంత పంపిణీ చేయాలన్నదానిపై ప్రతిఏటా ప్రభుత్వంలో జరిగే కసరత్తే కదా. మరి యూరియా సమస్య ఎందుకు వచ్చింది? ఐదేళ్ల మా పాలనలో ఇలాంటి సమస్య ఎప్పుడూ లేదన్నది వాస్తవం కాదా? ఇవాళ మీరు వైఫల్యం చెందారంటే ప్రభుత్వం అనేది సరిగ్గా పనిచేయడంలేదనే కదా అర్థం‘ అంటూ వైఎస్ జగన్ నిలదీశారు. ప్రభుత్వం నుంచి కిందకు వెళ్లిన ఎరువులను మీ పార్టీ నాయకులే దారి మళ్లించి అధిక ధరకు అమ్ముకుంటు-న్నారు. మరో వైపు ప్రైవేటు- వ్యాపారులు నల్లబజారుకు తరలించి, వాటిని బ్లాక్ చేసి, బస్తా యూరియా రేటు- రూ.267లు అయితే, దీనికి మరో రూ.200లు అధికంగా అమ్ముకుంటు-న్నారు. అక్రమ నిల్వలపై తనిఖీల్లేవు, ఎవ్వరిమీదా చర్యల్లేవు. ఆఈ÷ూలకు, ఇఔలకు సరైన కేటాయింపులు లేవు. దీనికి కారకులు మీరేకదా చంద్రబాబూ.. మా హయాంలో ఆర్‌బికెల 12 లక్షల టన్నుల ఎరువులను రైతుల వద్దకే స్లపైచేశాం. మార్కెట్ రేటు- కన్నా రూ.50ల తక్కువ రేటుకు రైతుకు అందించగలిగాం. మీరెందుకు ఆపని చేయలేకపోతున్నారు చంద్రబాబుగారూ? ఎందుకంటే బ్లాక్ మార్కెట్‌ల నుంచి మీ కొచ్చే కమీషన్లకోసం కాదా?అన్నారు. మరో వైపు పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు లబోదిబోమంటున్నారు. వరుసగా పంటల ధరలు పతనమవుతున్నా, ఈ రెండేళ్లలో వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జ, రాగులు, అరటి, చీనీ, కోకో, పొగాకు ధరలు పడిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, చిత్తశుద్ధితో ఏరోజూ రైతును ఆదుకోలేదు. క్వింటా ఉల్లి సగటున క్వింటాలుకు రూ.400-500లకు క్షీణించినా పట్టించుకునే నాథుడే లేడు. మరోవైపు ఇదే ఉల్లిని బహిరంగ మార్కెట్లో కిలో రూ.35లకు పైగా అమ్ముతున్నారు. మా ప్రభుత్వ హయాంలో ఉల్లి క్వింటా రూ.4వేల నుంచి రూ.12వేలు అమ్ముడయ్యేది. అంటే కేజీ రూ.40 నుంచి, రూ.120 దాకా రైతులు అమ్ముకున్నారు. ధరలు పతనమైనప్పుడు మా హయాంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని గిట్టు-బాటు- ధరలు కల్పించింది. మా ఐదేళ్ల కాలంలో, రైతులకు ఇలాంటి కష్టకాలం వచ్చినప్పుడు, 9,025 టన్నులను ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు తోడుగా నిలబడ్డాం. చీనీ ధర కూడా ఇప్పుడు మీ హయాంలో పడిపోయి టన్ను రూ.6వేల నుంచి రూ.12వేలు మాత్రమే పలుకుతోంది. మా హయాంలో టన్నుకు కనిష్టంగా రూ.30 వేలు, గరిష్టంగా రూ.1లక్ష ధర రైతులకు లభించింది. కోవిడ్‌లాంటి మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసిన సమయంలో రైతుల వద్ద చీనీ పంట ఉండిపోతే, ప్రభుత్వమే కొనుగోలు చేసి, ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టి ఒక ప్రభుత్వంగా రైతులను ఆదుకోవడానికి అన్నిరకాలుగా చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు ఇంత సంక్షోభం వచ్చినా చంద్రబాబుగారూ మీరు పట్టించుకోవడంలేదు. నిద్ర నటించేవాళ్లని ఎవరైనా లేపగలరా?‘ అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. మేం ఏర్పాటు- చేసిన ధరలస్థిరీకరణ నిధికి ఎగనామం పెట్టారు. దీనికింద రూ.7,802 కోట్లు- ఖర్చుచేసి మేం రైతులకు తోడుగా నిలబడితే మీరు ఆ విధానానికి మంగళం పాడారు.

మీకు ఓటేస్తే భవిష్యత్తుకు గ్యారంటీ- అన్నారు. కాని, రైతులకు గతంలో సులభంగా దొరికే బస్తా యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారు. ఇంత అధ్వాన్నంగా ప్రభుత్వాన్ని నడుపుతారా? మీరు అధికారంలోకి వచ్చింది మొదలు వరుసగా ఈ రెండేళ్లపాటు- రైతులకు ఎరువుల కష్టాలే. ఏ సీజన్‌లో పంట నష్టం వస్తే, అదే సీజన్ ముగిసేలోపు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, మరుసటి సీజన్‌లోగా ఇచ్చే క్రాప్ ఇన్సూరెన్స్(పంట నష్టపరిహారం)ను అందించే పద్ధతినీ ధ్వంసంచేశారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్నీ ఎత్తివేశారు. మేం క్రమం తప్పకుండా ఇస్తున్న రైతు భరోసాను ఎత్తివేసి, పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా, రైతులకు పెట్టు-బడి సహాయం కింద ఏడాదికి రూ.20వేలు, అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చి, వెన్నుపోటు- పొడిచారు. మొదటి ఏడాది ఎగ్గొట్టారు. రెండేళ్లకు కలిపి రూ.40వేలు ఇవ్వాల్సి ఉంటే ఇచ్చింది రూ.5వేలు మాత్రమే. అదికూడా సుమారు 7 లక్షల మంది రైతు కుటు-ంబాలకు ఎగ్గొట్టారు. అందుకే బాబు ష్యూరిటీ-, మోసం గ్యారంటీ-‘ అంటూ వైఎస్ జగన్ ఎండగట్టారు.

## యూరియా ఎందుకు దొరకడం లేదో చెప్పండి

కాకినాడ: ఊగిపోయి మాట్లాడావు కదా.. ఇప్పుడు ఏమైంది నీ పౌరుషం పవన్ అని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యానారాయణ ప్రశ్నించారు. కాకినాడలో బొత్స మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకునేవారే లేకుండాపోయారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒక బస్తా యూరియా కోసం రైతులు నానా అగచాట్లు- పడుతున్నారు. వ్యవసాయం దండగ,లాభంలేదని చంద్రబాబు బుర్రలో ఉంది. చంద్రబాబు అధికారంలో ఉంటే అతివృష్టి లేకపోతే అనావృష్టి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యూరియా ఎందుకు దొరుకుంతుంది? కూటమి అధికారంలో ఉన్న ఏపీలో యూరియా ఎందుకు దొరకడం లేదు. 9వ తేదీన రైతు సంఘాలతో కలిసి ఉద్యమిస్తాం. ఆర్డీవో ఆఫీసుల్లో వినతి పత్రాలు ఇస్తాం అని బొత్స అన్నారు. 32మంది బలిదానాలతో విశాఖ ఉక్కు పరిశ్రమ వచ్చింది. విశాఖ ఉక్కుపై ప్రజల్ని చైతన్య పరుస్తాం. విశాఖ ఉక్కుకోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. విశాఖ ఉక్కు గురించి సీఎం,డిప్యూటీ- సీఎం ఎందుకు మాట్లాడరు. పవన్ కల్యాణ్ ఉగిపోయి మాట్లాడావు కదా.. ఏమైందీ మీ పౌరుషం. ఎన్నికలకు పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన వాళ్లు ఇప్పుడు ఏమయ్యారు. విశాఖ ఉక్కుపై ప్రభుత్వ భవిష్యత్తు కార్యచరణ ఏంటీ-? పవన్.. మీరు ఉప్పు కారం తినడం లేదా?. ప్రధాని మోదీతో విశాఖ ఉక్కు గురించి చంద్రబాబు ఏం మాట్లాడారు. 15నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు- అప్పు చేసిందని వ్యాఖ్యానించారు. 15 నెలలు గడిచిన సుగాలి ప్రీతి కుటుంబానికి ఎందుకు న్యాయం చేయలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం తెలిసి మాట్లాడుతున్నారా? తెలియక మాట్లాడుతున్నారా? అంటూ బొత్స మండిపడ్డారు. దమ్ములు గురించి మాట్లాడటానికి ఇవి మల్ల యుద్ధాలు కాదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వండి..అసెంబ్లీ లో తేల్చుకుంటామని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 నెలల్లో రెండు లక్షలు కోట్లు- అప్పులు తెచ్చారని.. ఈ విషయం వాస్తవం కాకపోతే.. వెంటనే బయట పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతిలో తీసుకుని అక్రమంగా అరెస్ట్ లు చేస్తున్నారని ఆరోపించారు. 2029లో వైసీపీ అధికారంలోకి వస్తుందని.. మళ్లీ జగన్ సీఎం అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరు ఎప్పటికప్పుడు ఎండగడుతామని బొత్స అన్నారు.

# కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు- 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో చేరారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడి లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవు. చిత్తశుద్ధి గల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు. ఈ సన్నాసులకు ప్రభుత్వం నడపడం చేతకాదు. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపడం.. పదవులు కాపాడుకోవాలనే సోయి తప్ప ఇంకోటి లేదు. చివరకు కేసీఆర్‌ను తిట్టాలి అదే వారి పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్‌లో తెలంగాణలో అప్పులు ఎంత అని ప్రశ్న వేసిండు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు, వదిలిపెట్టిపోయిన అప్పు మూడున్నర లక్షల కోట్లు- అని కేంద్రం చెప్పింది. అందులో కేసీఆర్ రాకంటే ముందు 72 వేల కోట్ల అప్పు ఉంది. ఆయన వచ్చిన తర్వాత 2 లక్షల 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఇది మాత్రమే అప్పు అంటూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పింది. అయినా కాంగ్రెస్ నేతలకు సిగ్గులేదు. ఒకడు ఆరు లక్షలు అంటడు.. ఇంకొకడు ఏడు లక్షలు అంటడు. ఇంకోడు ఎనిమిది లక్షలు.. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నాడు.. ఆధారం, ప్రామాణికం, పత్రం అడిగితే లేదంటరు. ఉపన్యాసాలు అదరగొట్టాలి.. మీడియా మేనేజ్‌మెంట్ చేసుకోవాలి.. ఇదే కాంగ్రెస్ నేతల పని. వారి మీదికి దృష్టికి రాకుండా.. డైవర్షన్ గేమ్ ఆడుతున్నారు. కాళేశ్వరం, ఫార్ములా రేస్, విద్యుత్ అంశాల మీద సొల్లు పురాణం తప్ప ప్రజలకు పనికొచ్చే పని చేయలేదు అని కేటీ-ఆర్ నిప్పులు చెరిగారు.పంచాయతీ ఎన్నికలు అయినా, ఢిల్లీ ఎన్నికలు అయినా ఎగరాల్సింది గులాబీ జెండానే. కేసీఆర్ నాయకత్వంలో ముందుకు పోవాలి. చిన్నచిన్న సమస్యలు ఉంటాయి.. వాటిని పకక్కన పెట్టాలి. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ప్రజలు ఇవాళ కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటు-న్నారు ఎందుకంటే.. మన మధ్యన ఒక పెద్దాయన ఉంటే ఆయన విలువ తెలియదు. ఆయన ఆ పోజిషన్‌లో లేనప్పుడే తెలుస్తుంది. ఎప్పుడైనా చీకటిని చూస్తనే వెలుగు విలువ తెలుస్తుంది. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది. ఇవాళ గాడిదులు ఎవరైతే ఉన్నారో వారిని చూసిన తర్వాత కేసీఆర్ విలువ ప్రస్ఫుటంగా తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని రైతులు బాధపడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారం ఇవ్వడం లేదు.. చివరకు ఇనుము కూడా ఇవ్వరు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదు. ఇది దండుపాళ్యం బ్యాచ్.. బంగారం ఇచ్చే బ్యాచ్ అసలే కాదు. ఒక్కొక్క వర్గాన్ని చైతన్యవంతం చేసి.. గెలుపు దిశగా పయనించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు



హైదరాబాద్: బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్కల్లా చుట్టూ చేరిన హరీష్ రావు, సంతోష్ రావులతో జాగ్రత్త అంటూ కెసిఆర్ తనయ కవిత హెచ్చరించారు. అధికారంలో ఉండగా అడ్డగోలుగా సంపాదించుకున్న వీరు ఇప్పుడు మీకు కూడా ఎసరు పెట్టే పనిలో ఉన్నారు..తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అన్నా రామన్నా నీవు కూడా వరితో జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపడానికి కారణమైన వీరు మన కుటుంబం విచ్ఛిన్నం కావాలని పన్నాగం పన్నారని అన్నారు. బిఆర్ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీ-ఆర్)కు, మీకూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారని కవిత వ్యాఖ్యానించారు. అక్రమ కేసులు పెట్టి తిహార్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు- చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు- కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని.. గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీల అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు- చిలువలు పలువలుగా ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పాను. దానిలో తప్పేముంది? నా తండ్రి కేసీఆర్ చిటికెన వేలు పట్టుకుని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక

తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. చెప్పింది చెప్పినట్లు- ఆయన చేశారు. ప్రతి కులాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేనేమైనా తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ భారత రాష్ట్ర సమితికి అవసరం లేదా? భౌగోళిక తెలంగాణ వస్తే సరిపోతుందా? బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే అవుతుందా?సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే బంగారు తెలంగాణ అవుతుందని అంటూ అనేక విషయాలన మీడియాముందుంచారు. తనపై ఎలా కుట్రలు సాగించారో సోదాహరణంగా వివరించారు. నేను రామన్నను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

## అవినీతి కారణంగా బిఆర్ఎస్ అంతర్థానం !

బిఆర్ఎస్‌లో అవినీతి ఉందని, పాలనను అడ్డంపెట్టుకుని అందరూ బాగా సంపాదించారని కవిత వ్యాఖ్యల వల్ల మరింత స్పష్టం అయ్యింది. హరీష్ రావు, సంతోష్ రావులు బాగా సంపాదించారని కవితే స్వయంగా ఆరోపిస్తున్నారు. వారే మీడియాను ఆడిస్తున్నారని కూడా చెప్పారు. కెసిఆర్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే వారి లక్ష్యం అని కూడా ఆమె చెప్పారు. మొత్తంగా ఇదంతా బిఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలకు కారణంగా చూడాలి. అన్నింటికీ మించి కెసిఆర్ కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితంకావడం, అధికారం పోగానే ప్రజల్లోకి రాకపోవడం వల్ల పార్టీ పతనానికి చేరిందని చెప్పాలి. అధికారం ఉండగా అవినీతిలో మునిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాలరాశారు. అధికారం, డబ్బుతో విర్రవీగారు. తాను అచేతనంగా మారడంతో సమస్యలు వస్తున్నాయని ఇప్పుడు కెసిఆర్ గుర్తించడం లేదు. తాను కట్టిన కాళేశ్వరం సకల సమస్యలకు సమాధానమని చెప్పిన నేత, దానిని ఎదుర్కొనేందుకు ముందుకు రాలేదు. అసెంబ్లీకి ముఖం చాటేశారు. ఇదంతా కేవంల ఏడాదిన్నరలో పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే దశకు చేరుకోవడానికి కేవలం కెసిఆర్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. నాయకుడు అన్న వాడు ఎప్పుడూ ఉత్సాహంగా ముందుకు సాగాలి. అవినీతిని ఎదుర్కోవాలి. అధికారం ఉంటే అనుభవించమే కాదు...అవమానాలు వచ్చినా ధైర్యంగా నిలబడాలి. అప్పుడే నేతగా ప్రజలు గుర్తిస్తారు. కవిత వ్యవహారంతోఇప్పుడు బిఆర్ఎస్ అవినీతి పతాక స్థాయిలో కనిపిస్తోంది. అనేక పథకాల ద్వారా పార్టీలో ఉన్నవారు ఎంతగా సంపాదించారో ప్రజలకు అర్థం అయ్యింది. ప్రాంతీయ పార్టీలు అన్నీ తట్టుకుని నిలబడగలగాలంటే నేత అన్నవాడు గట్టిగా ఉండాలి.

## హరీష్ రావు, రేవంత్ కుమ్మక్కు నిజమే



హైదరాబాద్: రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు కుమ్మక్కయ్యారని తాను గతంలోనే చెప్పానని భాజపా ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కవిత కూడా ఇప్పుడు అదే విషయంచెబుతోందని అన్నారు. ఆమె ఇప్పుడు మీడియాతో కొత్తగా చెప్పింది ఏం లేదని పేర్కొన్నారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపారు. కవిత చెప్పిన మోకిల ప్రాజెక్టు అవకతవకల గురించి విచారించాలని చెప్పారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు.

జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారో గతంలో కేసీఆర్‌కు చెప్పాను. ఆరోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఇబ్బందిపెట్టాలని చూసినట్లు- గతంలోనే చెప్పా. కవిత ఇంకా వేరే విషయాలు కూడా మాట్లాడితే బాగుండేది. ఆమె మాటలతో భారత రాష్ట్ర సమితి అవినీతి పునాదుల మీద విస్తరించబడిందని తేలింది. మళ్లీ వచ్చే ఎపిసోడ్‌లో భారత రాష్ట్ర సమితి పెద్దలు చేసిన అవినీతిని బయటపెడితే బాగుంటుంది. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాల మీద మీరు పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని రఘునందన్‌రావు కవితను ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీలో తాజాగా చోటు- చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దుబ్బాకకు మీ కుటుంబం చేసిన అన్యాయం గురించి తాను అనేక సార్లు చెప్పానన్నారు. అలాగే దుబ్బాకు హరీష్ రావు వల్లే అన్యాయం జరిగిందని కూడా తాను ఆనాడే చెప్పానని తెలిపారు. బీఆర్ఎస్‌లో తాను ఓడిపోవడానికి కారణం ఏమిటో కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గతంలోనే చెప్పానన్నారు. ఒకే విమానంలో సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావులు ప్రయాణం చేశారని తాను గతంలోనే చెప్పానని పేర్కొన్నారు. అయితే కవిత చెప్పిన దాంట్లో కొత్తదనం ఏమీ కనిపించడం లేదన్నారు. మోకిల్లాలో జరుగుతున్న విల్లా ప్రాజెక్ట్‌పై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అలాగే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రావులపై వెంటనే ఏసీబీ డీజీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన సూచించారు. గతంలో నార్సింగి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సందీప్ రావు చేసిన అరాచకాలు చెప్పాల్సి ఉండేదన్నారు. సంతోష్ రావు వియ్యంకుడి హోదాలో మాత్రమే సందీప్ రావు అనేక అరాచకాలు చేశారని వివరించారు. అతడి ద్వారానే సంతోష్ రావు సెటిల్‌మెంట్లు చేసేవారన్నారు.

వేగుచుక్క

# నలందా ప్రీస్కూల్లో  ఘనంగా" పేరెంట్స్ డే".

## విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలపోటీలు.

## పాల్గొన్న యాజమాన్యం ప్రసాద్, సాగర్.








**వేగుచుక్క న్యూస్,ఆర్మూర్:**

పట్టణంలోని మామిడిపల్లి లో గల నలంద ప్రీ స్కూల్లో బుధవారం ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి యొక్క ఫ్యామిలీస్ గురించి చార్ట్స్ ద్వారా క్లుప్తంగా వారి తల్లిదండ్రులకు వివరించారు. మరియు ఉపాధ్యాయులు ఛార్జ్ ద్వారా సెల్ ఫోన్స్ మరియు టీవీ వాడకం వల్ల అనుకూలత మరియు ప్రతికూలత గురించి, పిల్లలకు అవుట్ సైడ్ ఫుడ్ అంటే స్నాక్స్, చాక్లెట్స్, బర్గర్స్ తినడం వల్ల ఏం జరుగుతుంది అనే విషయంపై తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల గురించి ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు వారు చేసే పనుల గురించి, వారి యొక్క అనుభవాలను వివరించారు. అనంతరం నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ, పిల్లల జీవితంలో తల్లిదండ్రులది ముఖ్యమైన పాత్ర ఉంటుందని, వారు పిల్లల్ని ఇంటికొచ్చిన తర్వాత ఉపాధ్యాయులు ఇచ్చినటువంటి హోం వర్క్ మరియు క్లాస్ వర్క్ ప్రణాళిక ప్రకారం చేయించాలని అన్నారు.
పిల్లలు సెల్ఫోన్స్ మరియు టీవీ ఎక్కువగా వాడటం వల్ల కలిగే దుష్ప్రయోజన గురించి, మరియు అవుట్ సైడ్ ఫుడ్ స్నాక్స్ , చాక్లెట్స్ మరియు బర్గర్స్ తినడం వల్ల కలిగే దుష్ప్రయోజనం గురించి వివరించారు. తర్వాత తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్, బెలూన్స్, పేరెంట్స్ పజిల్ మరియు కొన్ని ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ప్రీస్కూల్ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సౌమ్య, జ్యోతి, స్రవంతి, శ్రావణి, అశ్విత, ప్రవళిక, దీక్షిత లను తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు.

# వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా  ఎన్నికున్నారు. మంగళవారం ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్ లో  అధ్యక్షుడైన రవిచరణ్ రెడ్డి సమక్షంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా నూతన కమిటీ నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా పెరుమాండ్ల నగేష్ గౌడ్ (99 టీవీ), ప్రధాన కార్యదర్శిగా పులి అనిల్ (ఏబీఎన్), కోశాధికారిగా పి శ్రీకాంత్ (ఐ న్యూస్), ఆర్గనైజర్ సెక్రటరీగా అభిలాష్ (కే6), వైస్ ప్రెసిడెంటుగా మామిడాల అరవింద్ (టీవీ9), జాయింట్ సెక్రెటరీగా బొడ్డుల సాయి కిరణ్ (సాక్షి టీవీ), మిగతా సభ్యులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# టియులో పీహెచ్డీ ప్రవేశాల నోటిఫికేషన్.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి:**




తెలంగాణ విశ్వవిద్యాలయంలో  2025- 26 విద్యా సంవత్సరానికి ఉర్దూ, బిజినెస్ మేనేజ్మెంట్, కామర్స్, అప్లైడ్ స్టాటిస్టిక్స్, బాటని, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, జియో ఇన్ఫర్ మాటిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎకనామిక్స్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, సోషల్ వర్క్ మరియు లా విభాగాలలో పీహెచ్డీ ఖాళీల ప్రవేశాల కొరకు అప్లికేషన్స్ ఆహ్వానిస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏం యాదగిరి  తెలియజేశారు. అప్లికేషన్స్ 25- 9 -2025 వరకు విశ్వవిద్యాలయ కార్యాలయంలో సమర్పించాలి. పూర్తి వివరాలు తెలంగాణ విశ్వవిద్యాలయం వెబ్సైట్లో  పొందుపరిచారు.

# నేడు జిల్లాలో సీఎం పర్యటన.




- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 3:**

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గురువారం జిల్లాల్లోని వర్షం వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్ని పరిశీలించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటించే ప్రాంతాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి పరిశీలించారు. తాడ్వాయి మండలం ఎర్ర పహాడ్ వద్ద ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్ దిగేందుకు ఏర్పాటుచేసిన హెలిపాడ్ ను పరిశీలించి ఇన్చార్జిలుగా చూసుకోవాలని ఆర్డీవో కామారెడ్డి, తహసిల్దార్ తాడ్వాయి లకు సూచించారు. అనంతరం లింగంపేట్ మండలంలో దెబ్బతిన్న లింగంపల్లి, కుర్దు వంతెనను పరిశీలించి ముఖ్యమంత్రి వచ్చే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని, వరద వల్ల బ్రిడ్జికి కలిగిన డామేజ్ ను చూపించేలా బాధ్యతలు చూసుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డికి సూచించారు. లింగంపేట్ మండలం బుడిగిడా గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి ముఖ్యమంత్రికి జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలు తెలపాలని వ్యవసాయ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కామరెడ్డి పట్టణంలోని జి ఆర్ కాలనీలో పర్యటించి సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టరేట్ లో ముఖ్యమంత్రి నిర్వహించనున్న జిల్లా అధికారులతో వరదలపై సమీక్ష, ఫోటో ఎగ్జిబిషన్, ఏర్పాట్లను పరిశీలించి పరిశీలించి ముఖ్యమంత్రి కార్యక్రమం సాఫీగా జరిగేలా ????? శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్, రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, మున్సిపాలిటీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అరికెల నర్సారెడ్డిని కలిసిన మోటడి రెడ్డి నగర కార్యవర్గం.



**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**

నగర మొటడి రెడ్డి సంక్షేమ సంఘం నూతనంగా ఏర్పడిన కార్యవర్గ సంఘ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా అరికెలా నర్సారెడ్డి మాట్లాడుతూ, తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని జిల్లాలో ఉన్న అందర్నీ కలుపుకొని ముందుకు పోవాలని సూచించారు. జిల్లా రెడ్డి బంధువులకు ఎటువంటి సహకారం కావాలన్నా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అయిన గాదరి సంజీవరెడ్డి, మోతె నవీన్ రెడ్డి అరికెల నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, సంఘ సభ్యులు వినోద్ రెడ్డి, గంగారెడ్డి, సుభాష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలజ్ గణపతిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే.




**వేగుచుక్క న్యూస్:తెలంగాణ,**

మహారాష్ట్ర సరిహద్దులో కొలువుదీరిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన "పాలజ్ కర్ర గణపతి"ని నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ దర్శించుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వజనిక్ గణేష్ మండలి ఆలయ పూజరులు ఎమ్మెల్యే ను పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు, "కర్ర గణపతి ఆలయం నేటికీ ఎన్నో తారాలుగా భక్తుల నమ్మకానికి కేంద్రబిందువుగా నిలుస్తూ ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పవిత్ర క్షేత్రం భక్తుల ఆకాంక్షలను కోరికలను తీరుస్తుందని అన్నారు. పాలజ్ ప్రాంతంలో ఏడుదశబ్దాల క్రితం విషవ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మన నిర్మల్ జిల్లా కొయ్యబొమ్మల కళాకారుడుచే ఒకే చెక్కతో గణపతి తయారు చేసి పూజించడం అది దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందడం గర్వకారణం అన్నారు.కర్ర గణపతి ఆలయానికి గొప్ప చరిత్ర ఉందని అన్నారు. గణపతిని 11 రోజులు భక్తి శ్రద్దలతో పూజిస్తే ఎటువంటి విషవ్యాధులు దరికి చేరవణి ప్రజల విశ్వసం అన్నారు. ప్రజలు భక్తి శ్రద్దలతో కర్రగణపతిని పూజించి నిమజ్జనం చేయకుండా ఊరేగించి ఒక గదిలో భద్రపరచడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. కర్ర గణపతి ఆశీర్వాదంతో దేశ, రాష్ట్ర ప్రజలదరు సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు అనుకూల వర్షాలు పడి పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు.

# అలరించిన చిన్నారుల వేషధారణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



నగరంలోని గుమస్తా కాలోని దుర్గామాత ఆలయంలో బుధవారం చిన్నారుల వేషధారణ చూపరులను ఆకట్టుకుంది. చిన్నారులు కృషుడు, గణపతి, పోతారాజు, అన్నపూర్ణ దేవి, గోపిక వంటి పలు వేషధారణల్లో పాల్గొని భక్తులను అలరించారు.పిల్లల అమాయక హావభావాలు, అందమైన వేషధారణలు చూసి భక్తులు మంత్ర ముగ్దులయ్యారు. ఆలయ వాతావరణం భక్తి, ఆనందం, సాంస్కృతిక కాంతులతో నిండిపోయింది. ఈ సందర్బంగా ఆలయ అధ్యక్షులు ఆమందు విజయ్ కృష్ణ మాట్లాడుతూ, చిన్నారులు మన సంస్కృతి, సంప్రదాయాలను అలవోకగా ఆచరిస్తూ ఈ తరహా వేశధారణల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కోశాధికారి ధాత్రిక వేణుగోపాల్, గణేష్ కమిటీ అధ్యక్షులు ధాత్రిక గంగసాయి, కార్యదర్శి ధాత్రిక అఖిల్ రాజ్, సభ్యులు హరీష్, ప్రవీణ్, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# బిల్లులు గ్రీన్ ఛానల్ ద్వారా ఇవ్వాలి.

ఎండిఎం జిల్లా నాయకులు చక్రపాణి, ఓమయ్య డిమాండ్. డీఈవో కార్యాలయం వద్ద ధర్నా.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**





ప్రభుత్వం బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా ఇవ్వాలనీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు చక్రపాణి, ఒమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి, డీఈఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వము గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు ఇస్తామని చెప్పి జీవో ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు ఇవ్వాలని, ముఖ్యంగా 10,000 వేతనము  ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలని, నిత్యవసర వస్తువులు, కోడిగుడ్లు, గ్యాస్, సరఫరా చేయాలని అన్నారు. జిల్లాలో నాలుగు కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయనీ, అవి వెంటనే చెల్లించాలని, ఆ బిల్లు కూడా గ్రీన్ ఛానల్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు స్రవంతి , సాయమ్మ, గంగాధర్, గౌస్, కవిత, రమ, కార్మికులు పాల్గొన్నారు

# నా ఆరోగ్యం బాగానే ఉంది..

పుకార్లను నమ్మకండి..మీడియా ముందు ప్రత్యక్షమైన ట్రంప్
న్యూయార్క్:ట్రంప్ ఆరోగ్యంగా లేరంటూ అమెరికా అధ్యక్షుడు అనారోగ్యంగా ఉన్నారని సోషల్‌మీడియాలో ఇటీవల రకరకాల ప్రచారాలు జరిగాయి. కొద్దిరోజులుగా ట్రంప్ బహిరంగంగా కనిపించకుండా ఉండటంతో తీవ్ర సందేహాలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. పైగా ఆయన కుడిచేతిపై గాయాలతో కనిపించడం ఈ అనుమానాలను మరింత పెంచింది. వీటన్నింటిపై తాజాగా ట్రంప్ స్పందించారు. తాజాగా ఓవల్ ఆఫీసులో మీడియా ముందుకొచ్చిన ఆయన.. వాటన్నింటినీ ఫేక్ న్యూస్ అని ఆయన కొట్టిపారేశారు. చాలా రోజుల తర్వాత మంగళవారం నాడు మీడియా ముందుకు వచ్చిన ట్రంప్‌ను కొంతమంది రిపోర్టర్లు ఆయన ఆరోగ్యంపై ప్రశ్నించారు. ' మీరు చనిపోయారని సోషల్‌మీడియాలో వార్తలు వచ్చాయి.' వాటి గురించి తెలుసా అని అడిగారు. దీనికి ట్రంప్ స్పందిస్తూ.. అవునా, నేను చనిపోయానని వార్తలు వస్తున్నాయా? నాకు తెలియదు అంటూ వ్యంగ్యంగా బదులిచ్చారు. అవన్నీ వట్టి పుకార్లే అని అని గుర్తించారుగా అని సమాధానం ఇచ్చారు. ఈ వీకెండ్‌లో చాలా ఆరోగ్యంగా ఉన్నానని, వర్జీనియా గోల్ఫ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడానని చెప్పారు. అంతేకాదు 'ట్రూత్' సోషల్‌లో శనివారం నుంచి సోమవారం వరకు 90కి పైగా పోస్టులు కూడా చేశానని వివరించారు. రెండు రోజుల పాటు- తాను ఎలాంటి మీటింగ్‌లు పెట్టలేదని.. అందుకే ఇలాంటి వదంతులు వచ్చాయని పేర్కొన్నారు. గత వారంలో చాలా ప్రెస్‌మీట్‌లు పెట్టాను.. అవన్నీ సక్సెస్ అయ్యాయి. ఆ తర్వాత రెండు రోజుల పాటు- మీటింగ్‌లు పెట్టకపోవడంతో.. ఏదో జరిగిందని అనుకున్నారని వివరించారు. ఇక గత అధ్యక్షుడు జో బైడెన్‌ను కూడా ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. బైడెన్ అయితే నెలల తరబడి పబ్లిక్ మీటింగ్‌లు పెట్టకుండా ఉండేవాడని.. అయినా ఎవరూ ఆయన ఆరోగ్యం గురించి ఏమీ అనలేదని అన్నారు. కానీ ఆయన ఆరోగ్య పరిస్థితి అంత గొప్పగా ఏమీ లేదని చెప్పారు. డోనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై వైట్‌హౌస్ వైద్యులు ఇప్పటికే వివరణ ఇచ్చారు. ట్రంప్ చేతిపై కనిపిస్తున్న మచ్చకు ఆయన తీసుకుంటు-న్న ఆస్పిరిన్ మందే కారణమని తెలిపారు. హ్యాండ్‌షేక్ ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆయనకు ఆ మచ్చలు వస్తాయని.. అవి మళ్లీ మాయమవుతాయని పేర్కొన్నారు. ఇక క్రానిక్ వీనస్ ఇన్‌సఫీషియన్సీ కారణంగా ఆయనకు కాళ్ల వాపులు వచ్చాయని చెప్పారు. అవన్నీ సర్దుకున్నాయని చెప్పారు.

వేగుచుక్క



# నగరవాసులకు అలర్ట్..

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగర వాసులకు అలర్ట్. నగర పరిధిలో మీటర్ లేని నల్లా కనెక్షన్లపై హైదరాబాద్ జల మండలి (వాటర్ బోర్డు) కఠిన చర్యలకు సిద్ధమైంది. ఉచిత తాగునీటి పథకం కారణంగా తగ్గిన ఆదాయాన్ని తిరిగి పెంచుకోవడానికి, ఇప్పుడు అన్ని నల్లా కనెక్షన్లకు మీటర్లను తప్పనిసరి చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ సంస్కరణల ద్వారా నీటి వినియోగాన్ని పారదర్శకంగా పర్యవేక్షించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకం కింద అర్హత ఉన్న ప్రతి కనెక్షన్‌కు నెలకు 20,000 లీటర్ల నీటిని ఉచితంగా అందిస్తున్నారు. నగరంలో ఉన్న మొత్తం 9.73 లక్షల నల్లా కనెక్షన్లలో కేవలం 4.70 లక్షల కనెక్షన్లు (44%) మాత్రమే ఈ పథకంలో చేరాయి. మీటర్లు ఉన్న వినియోగదారులు 20 వేల లీటర్ల వరకు జీరో బిల్లు చెల్లిస్తుండగా.. అంతకు మించి వినియోగిస్తే అదనపు నీటికి బిల్లు చెల్లిస్తున్నారు.

అయితే, గ్రేటర్ హైదరాబాద్‌లో 5 లక్షల కనెక్షన్లకుపైగా మీటర్లు లేవు. ఈ కనెక్షన్లలో నీటి వినియోగంపై సరైన లెక్కలు లేకపోవడంతో జల మండలికి భారీగా ఆదాయం నష్టం జరుగుతోంది. మురికివాడల్లోని పేద కుటుంబాలకు మీటర్లు లేకపోయినా ఉచిత పథకాన్ని వర్తింపజేస్తున్నప్పటికీ, ఇతర ప్రాంతాల్లోని భవనాల్లోనివారు మీటర్లు లేకుండానే ఇష్టానుసారం నీటిని వాడుకుంటున్నారు. వీరు నల్లా పైపు సైజు ఆధారంగానే బిల్లులు చెల్లిస్తుండడంతో, వాస్తవ వినియోగానికి, బిల్లులకు మధ్య పొంతన ఉండడం లేదు. దీని వల్ల బోర్డుకు రావాల్సిన ఆదాయం రావడం లేదు.

ఉచిత తాగునీటి పథకం ప్రారంభం తర్వాత జల మండలికి నెలకు దాదాపు రూ. 30 కోట్ల ఆదాయం తగ్గింది. ప్రభుత్వం ఈ పథకానికి ప్రతీ ఏటా రూ. 300 కోట్లు కేటాయిస్తున్నప్పటికీ నిధులు మాత్రం రూ. 200 కోట్లకు మించి విడుదల చేయడం లేదు. ఈ నేపథ్యంలో జల మండలి తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి పలు సంస్కరణలను చేపడుతోంది. ఇందులో భాగంగా, మీటర్లు లేని వినియోగదారులు మీటర్లను ఏర్పాటు చేసుకోవడానికి కొంత గడువు ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది.

ఈ గడువులోగా మీటర్లను ఏర్పాటు చేసుకోని వారికి సాధారణ ఛార్జీలకు అదనంగా జరిమానా విధించేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ చర్యల ద్వారా అన్ని కనెక్షన్లకు మీటర్లను తప్పనిసరి చేసి, నీటి వినియోగాన్ని నియంత్రించవచ్చని తద్వారా జల మండలి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవచ్చని భావిస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల నీటి వృథా కూడా తగ్గే అవకాశం ఉంది.

# తెలంగాణలో రైతులకు తీపి కబురు..

తెలంగాణ: పంట సాగు చేసే రైతులకు యూరియా ఎరువుల కొరత పెద్ద సమస్యగా మారింది. పంటల పెరుగుదల, దిగుబడుల పెరుగుదలకు అవసరమైన ప్రధాన ఎరువుగా యూరియా ఉపయోగిస్తారు. అయితే సరఫరాలో అంతరాయం కలిగిన ప్రతిసారీ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వరుస వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన సందర్భంలో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. పంటలు రక్షించుకోవాలంటే సమయానికి యూరియా అందుబాటులో ఉండాలి.

కానీ గిడ్డంగుల్లో సరఫరా తక్కువగా ఉండటంతో ఈ సారి రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలా.. యూరియా అందుబాటులో లేక పంటల సాగులో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు ప్రభుత్వం సకాలంలో సహాయం అందించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే రాష్ట్రానికి 9 వేల టన్నుల యూరియా చేరగా.. రాత్రి 5 వేల టన్నుల సరఫరా జరగనుంది. అదేవిధంగా వచ్చే వారం రోజుల్లో మొత్తం 27,470 టన్నుల యూరియా రాబోతుందని వ్యవసాయశాఖ అధికారులు



వెల్లడించారు.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సరఫరా ప్రక్రియను పర్యవేక్షిస్తూ.. ఎరువుల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని జిల్లా స్థాయి అధికారులకు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా వరదల కారణంగా నష్టపోయిన రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ఆదేశించారు. వరదల వల్ల పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో 5 రోజుల్లోగా పూర్తి స్థాయి సర్వే చేసి.. నష్టపోయిన రైతులకు సహాయ చర్యలు చేపట్టేలా సంబంధిత శాఖలను ఆదేశించారు. నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.10 వేల చొప్పున ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు జిల్లాల్లో పంటలు ముంపుకు గురై రైతులు తీవ్ర



ఆందోళనలో ఉన్నారు. అటువంటి పరిస్థితుల్లో యూరియా సరఫరా పెరగడం రైతులకు ఊరట కలిగించే అంశంగా చెప్పుకోవచ్చు. సరఫరా అయిన యూరియాను ప్రభుత్వ గిడ్డంగుల ద్వారా సకాలంలో అందుబాటులోకి తేవాలని.. ఎక్కడా నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

యూరియా సరఫరా సక్రమంగా జరిగితే రాబోయే సాగులో పెద్ద సమస్యలు రాకుండా ఉంటాయి. రైతులు పంటల పెరుగుదలకు అవసరమైన ఎరువులను పొందగలిగితే.. దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది. రైతుల సమస్యలను ప్రభుత్వం సమయానికి గుర్తించి చర్యలు తీసుకోవడం పట్ల రైతు సంఘాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఎలాంటి ఆలస్యం లేకుండా రైతులకు ఎరువులను సరఫరా చేయాలని కోరుతున్నారు.

# కొత్తగా మరో మెడికల్ కాలేజీ..

తెలంగాణ: కొత్తగా మరో మెడికల్ కాలేజీ అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ మండల కేంద్రంలో కొత్త మెడికల్ కాలేజీ మంజూరైంది. నేషనల్ మెడికల్ కమిషన్ ఈ కాలేజీకి 50 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతిస్తూ ఇవాళ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది నుంచే కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేస్తూ.. ఆరోగ్య శాఖ కార్యదర్శిని, మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను అభినందించారు.



కొడంగల్ మెడికల్ కాలేజీతో కలిపి తెలంగాణలో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 34కు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మెడికల్ కళాశాల్లో సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే... ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ప్రస్తుతం 8,340 కంటే ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లు 4,100 కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇక వైద్య విద్యలో స్థానికతపై సుప్రీంకోర్టు జీవో 33ని సమర్థించింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కౌన్సెలింగ్‌కు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఈ తీర్పు తర్వాత వైద్య విద్యా మండలి ఒకట్రెండు రోజుల్లోనే మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించనుంది.

ఈ నిర్ణయంతో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఎదురైన అడ్డంకులు తొలగిపోయాయి. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. స్థానిక కోటా 85 శాతం కింద ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఇంటర్ వరకు వరుసగా నాలుగు సంవత్సరాలు తెలంగాణలో చదివి ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిబంధన సరైనదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. శాశ్వత నివాసం ఉన్నవారు వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదవాల్సిన అవసరం లేదని గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాలకు బదిలీ అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల అధికారులు, అఖిల భారత సర్వీసు అధికారులు, కేంద్ర సాయుధ బలగాల ఉద్యోగుల పిల్లలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు కొత్త జీవో జారీ చేయాలని ప్రభుత్వానికి సూచించింది. గతంలో కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రవేశాలు పొందిన విద్యార్థుల అర్హతకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. వారి ప్రవేశాలను మార్చవద్దని ఆదేశించింది.

సుప్రీంకోర్టు తీర్పుతో వైద్య విద్య కోర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియకు లైన్ క్లియర్ అయ్యింది. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం త్వరలో కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా మినహాయింపు పొందిన ఉద్యోగుల పిల్లల కోసం జీవో 33కు సవరణలు చేస్తూ కొత్త జీవో తీసుకురానుంది. ఈ నెల 10 నాటికి మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది.

# ప్రియుడి మోజులో భర్తను, కూతురిని కడతేర్చిన మహిళ..

జయశంకర్ భూపాలపల్లి: జిల్లాలో ఒక భయంకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం కోసం ఒక మహిళ కన్న కూతురి, కట్టుకున్న భర్తను దారుణంగా హత్య చేసింది. అంతేకాదు తన నేరాన్ని కప్పిపుచ్చు కోవడానికి నరబలి డ్రామా ఆడి పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. అనంతరం అనుమానాస్పద ప్రవర్తనతో పోలీసులకు చిక్కింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వడితల గ్రామంలో దారుణం వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం కోసం ఒక మహిళ తన భర్తను, 22 ఏళ్ల కూతురిని దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆమె తన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి సినీ ఫక్కీలో నరబలి డ్రామా కూడా ఆడినట్లు పోలీసులు తెలిపారు.

వడితల గ్రామానికి చెందిన కవిత భర్త పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఇదే సమయంలో కవిత అదే గ్రామానికి చెందిన ఒక యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తన భర్తకు తెలిసిపోతుందని భయపడిన కవిత.. ప్రియుడితో కలిసి జూన్ 25న భర్తను చంపింది. అనంతరం గుండెపోటుతో అతడు చనిపోయినట్లు నమ్మించి అంత్యక్రియలు కూడా పూర్తి చేసింది. కొంతకాలం తర్వాత తన వివాహేతర సంబంధం గురించి కూతురు వర్షిణి (22)కి కూడా తెలుస్తుందని అనుమానించిన కవిత.. ఆమెను కూడా అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ప్రియుడి తో కలిసి వర్షిణిని చంపి ఆమె మృతదేహాన్ని భూపాలపల్లి–కాటారం హైవే పక్కన అడవిలో పడేసింది.

నరబలిగా చిత్రీకరించే ప్రయత్నం

పోలీసులను తప్పుదోవ పట్టించడానికి కవిత ఒక పథకం వేసింది. కూతురి మృతదేహాన్ని పడేసిన చోట చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ చల్లి, మృతదేహం పక్కన వర్షిణి ఆధార్ కార్డు పెట్టింది. ఇది క్షుద్రపూజలు చేసి నరబలి ఇచ్చినట్లుగా కనిపించేలా చేసింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు కవిత తీరుపై అనుమానం కలిగింది. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా.. దారుణమైన నిజాలు బయటపడ్డాయి.

విచారణలో కవిత రెండు నెలల క్రితం ప్రియుడితో కలిసి భర్తను, ఇప్పుడు కూతురిని హత్య చేసినట్లు ఒప్పుకుంది. అంతేకాకుండా ఆమె మరో హత్యకు కూడా ప్లాన్ చేస్తున్నట్లు తేలింది. ఈ హత్యల వెనుక కవితకు ప్రియుడిపై మోజు, ఆస్తిపై ఉన్న ఆశ కూడా ఒక కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కవితను, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపారు. ఈ దారుణ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రేపటి నుంచి వైన్ షాప్స్ బంద్..



హైదరాబాద్: గణేశ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో వైన్ షాపులు రెండు రోజులు మూసివేయాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 6వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే.. స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్ లకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణకు, భక్తులు ఇబ్బందులు లేకుండా నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొనేందుకు దోహదపడనున్నాయి.

**జిల్లా స్థాయిలో నిబంధనలు..**

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా ఆంక్షలు అమలవుతున్నాయి. ఆదిలాబాద్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి.. అంటే రేపు ఉదయం 6 గంటల నుంచి.. 6వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రాంతాలవారీగా వైన్ షాపులు బంద్ చేయాలని స్థానిక అధికారులు ఆదేశించారు. పెద్దపల్లితో సహా పలు జిల్లాల్లో ఈనెల 5న మద్యం దుకాణాలు మూసివేయాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాలు నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు తీసుకున్నారు. గణేష్ నిమజ్జనం సమయంలో తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో.. ఈ చర్యలు రవాణా భద్రతకు కూడా తోడ్పడనున్నాయి.

ఈ నెల 6, 7 తేదీలలో హైదరాబాద్ నగరంలో భారీగా వినాయక నిమజ్జనం జరగనుంది. ముఖ్యంగా ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనం సెప్టెంబర్ 6వ తేదీన జరగనుంది. ట్యాంక్ బండ్‌పై ఈ రెండు రోజులు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికి అనుగుణంగా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలను అమలు చేయనున్నారు. నిమజ్జనం కార్యక్రమం సులభంగా.. భద్రంగా జరిగేలా పోలీసులతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. పెద్ద పెద్ద గణపతి విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్రత్యేక క్రేన్‌లు, ఇతర రక్షణ చర్యలు చేపట్టనున్నారు. ఈ నిబంధనలు భక్తులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ఇదిలా ఉండగా.. సెప్టెంబర్ 6న నిర్వహించే ఈ శోభాయాత్రకు కేంద్ర హోం మంత్రి అబిత్ షా రానున్నారు. బడా గణేష్ నిర్వాహకులు భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు హోం మంత్రి అమిత్ షా పాల్గొనబోతున్నారు.

# హరీష్‌పై సంచలన ఆరోపణలు..

తెలంగాణ: బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ కవిత తొలిసారిగా స్పందించారు. జాగృతి ఆఫీసులో మీడియా సమావేశం నిర్విహించిన ఆమె.. తనపై కుట్రలు జరుగుతున్నాయన్నారు. హరీష్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి కుట్రలకు తెరలేపారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. హరీష్, రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి ఒకే విమానంలో ప్రయాణం చేశారని ఆరోజే తనపై కుట్రకు తెరలేపారన్నారు. ‘ నాపై అక్రమ కేసులు పెట్టి తీహార్ జైలు నుంచి వచ్చిన తర్వాత ప్రజాక్షేత్రంలో పని చేశా. హాస్టల్స్, గురుకులాల్లో జరిగుతున్న అక్రమాలపై మాట్లాడా. బీసీల కోసం, మహిళలకు రూ.2500 ఇవ్వాలని ఉద్యమం చేశా. తెలంగాణ తల్లి స్వరూపం మారిస్తే నిరసన తెలిపా. తెలంగాణ ప్రాజెక్టులపై రౌండ్ టేబుల్ పెట్టా. భద్రాచలం గ్రామాలపై పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చా. సీఎం సొంత జిల్లాల్లోనూ కార్యక్రమాలు చేపట్టా. గులాబీ కండువా కప్పుకొని.. బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడి 47 నియోజకవర్గాల్లో పర్యటించా. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యకలపాలు ఎలా అవుతాయి. పార్టీ పెద్దలు వీటిపై పునరాలించుకోవాలి. బీసీల కోసం మాట్లాడితే వ్యతిరేకత ఎలా అవుతుంది.

నాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కత్తి కట్టుకొని కొందరు నాపై దుష్ప్రచారం. సామాజిక తెలంగాణ కోసం మాట్లాడితే అందులో తప్పేముంది. నా తండ్రి చిటికిన వేలు పట్టుకొని ఉద్యమాలు చేశా. ఆయన నుంచే సామాజిక తెలంగాణ స్ఫూర్తిని పొందా. నేను నిన్న చెప్పిన ఇద్దరు పని కట్టుకొని నాపై దుష్ప్రచారం చేశారు. హరీష్, సంతోష్ ఇంట్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అయిపోతదా. దానికి ఇష్టం వచ్చినట్లు స్టోరీలు ఇస్తే సరిపోతుందా..? రామన్నను గడ్డం పట్టుకొని అడుగుతున్నా.. నాపై కుట్రలు జరుగుతుంటే కనీసం ఫోన్ చేసి అడగరా..? 103 రోజులవుతుంది. ఒక్క మాట మాట్లాడిరా..? ఏం జరిగినా నేను కేసీఆర్ గారికి, రామన్నకు హానీ జరనివ్వను.

నాపై జరిగిన కుట్రలు రామన్నపై కూడా జరిగే ఛాన్స్ ఉంది. రేపు ఇదే ప్రమాదం రామన్నకు కూడా పొంచి ఉంది. హరీష్ రావు బీజేపీతో కూడా టచ్‌లో ఉన్నారు. డబ్బు సంపాదించాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నన్ను పార్టీ నుంచి బయటకు పంపారు. రేవంత్, హరీష్ కుమ్మక్కై నాపై కుట్రలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు సైట్ మార్చినప్పుడు మంత్రి హరీష్‌రావే కదా?. ఎస్సీ, ఎస్టీ, బీసీ హస్టళ్లకు హరీష్ డెయిరీ నుంచి పాల



పంపిణీ జరిగింది. అందులో అవినీతి జరిగితే రేవంత్ సర్కార్ స్పందించలేదు. ఆతర్వాత హరీష్ ట్రబుల్ షూటర్ కాదు.. బబుల్ షూటర్. ట్రబుల్ క్రియెట్ చేసి దీన్ని సాల్వ్ చేసినట్టు చెప్పుకుంటారు. మీడియా మేనేజ్‌మెంట్‌లో హరీష్ సూపర్. తెలంగాణ ఉద్యమం మొదటి నుంచి డే-1 నుంచి హరీష్ రావు లేరు. ఎమ్మెల్యే పదవికి, డిప్యూటీ స్పీకర్ పదవికి కేసీఆర్ రాజీనామా చేస్తుంటే హరీష్‌రావు వద్దన్నారు. నిజామాబాద్‌లో నా ఓటమిలో కూడా కుట్రలు చేశారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను కూడా ఓడించే ప్రయత్నం చేశారు. ఇందులో సంతోష్ రావు హస్తం కూడా ఉంది. ‘ అని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

స్పీకర్ ఫార్మాట్‌లో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దాంతో పాటుగా బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు కవిత వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకే సిమెంటు, స్టీలు

తెలంగాణ: తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సహకరించాలని సిమెంట్, స్టీలు పరిశ్రమలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడంలో పరిశ్రమల పాత్ర కీలకమని ఆయన వెల్లడించారు. మంగళవారం సెక్రటేరియట్‌లో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి సిమెంట్, స్టీలు పరిశ్రమల యజమానులు, ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ పథకానికి అవసరమైన నిర్మాణ సామగ్రిని తక్కువ ధరలకు, నాణ్యతలో రాజీ పడకుండా అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పేదలందరికీ గృహ వసతి కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం రూ. 22, 500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాల ని లక్ష్యంగా పెట్టుకుందని ఈ భారీ ప్రాజెక్టు ఇప్పటికే ప్రారంభమైందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం ద్వారా ఇళ్లు లేని పేదలకు సొంత ఇల్లు సమకూరుతుందని.. ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని చెప్పారు. మానవీయ కోణాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశ్రమలు తమ వంతు సహకారం అందించాలని డిప్యూటీ సీఎం భట్టి కోరారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దేశంలోని అన్ని ప్రధాన సిమెంట్, స్టీలు కంపెనీల నుంచి నిర్మాణ సామగ్రిని సమీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సామగ్రి ధరలను పరిశీలించడానికి ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు సిమెంట్ కంపెనీలు అందిస్తున్న ధరలపై మంత్రులు సమీక్షించారు. 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు 50 లక్షల టన్నుల సిమెంట్, 2.75 లక్షల టన్నుల స్టీలు అవసరం అవుతుందని అంచనా వేశారు. ఈ భారీ పరిమాణంలో సామగ్రి అవసరం కావడంతో, పరిశ్రమల సహకారం అనివార్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా.. ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి ఒక చారిత్రక ప్రాజెక్టులో భాగమయ్యే అవకాశం లభించడం తమకు అదృష్టంగా భావిస్తున్నామని సిమెంట్, స్టీలు కంపె నీల ప్రతినిధులు తెలిపారు. త్వరలో పరిశ్ర మల శాఖ ఆధ్వర్యంలో మరో సమావేశం నిర్వహించి, ధరలపై తుది నిర్ణయం తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ భాగస్వామ్యం విజయవంత మైతే ఇందిరమ్మ ఇళ్ల పథకం సకాలంలో, నాణ్యతతో పూర్తయ్యే అవకాశం ఉంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. ఆరోగ్య కార్డుల సమస్యకు సానుకూలంగా స్పందించింది. ఉద్యోగుల ఆరోగ్య కార్డులు , ఇతర పెండింగ్ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఉద్యోగ సంఘాలతో సమావేశమై చర్చలు జరిపింది. ఉద్యోగులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత ఆరోగ్య చికిత్స (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్) కోసం ఆరోగ్య కార్డులను మంజూరు చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు శ్రీధర్



బాబు, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ఇతర అధికారులతో కలిసి టీజీఈజాక్ ప్రతినిధులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస రావు నేతృత్వంలో సుమారు 40 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున ఒక అనధికారిక నోట్‌ను కూడా విడుదల చేశారు. ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అందించేందు కు ఆరోగ్య కార్డుల మంజూరుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలోని అధికారుల కమిటీ ఈ నెల 8న సమావేశమై త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం నెలకు రూ.700 కోట్ల నుంచి రూ.750 కోట్లు విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరిం చింది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే అంతకంటే ఎక్కువ నిధులు కేటాయించి బిల్లులను క్లియర్ చేస్తామని హామీ ఇచ్చింది. విజిలెన్స్, ఏసీబీ కేసుల కారణంగా రెండేళ్లకు పైగా సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చింది.